# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

# ప్రాంతీయ వార్తా విభాగం

# ప్రాంతీయ వార్తలు

తేది : 10 -01-2026 సమయం : 6.45 గంటలు

## ముఖ్యాంశాలు

- లైట్ హౌస్ సముద్ర సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాలని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ పేర్కొన్నారు.
- మర్షణలు లేకుండా ఉభయ తెలుగు రాష్ట్రాలు కృష్ణా నదీ జలాలను వినియోగించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు.
- దావోస్ సదస్సులో 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్'ను విస్తృతంగా ప్రచారం చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్రెడ్డి అధికారులను ఆదేశించారు.
- ఆంధ్రప్రదేశ్ లోని జైళ్ళు, అగ్నిమాపక శాఖలలో త్వరలోనే ఉద్యోగాల భర్తీ చేపడతామని హెూం మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు.
- ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలోని పాఠశాలలకు ఈ రోజు నుండి సంక్రాంతి సెలవులు ప్రారంభమయ్యాయి.

-----------------------

లైట్ హౌస్ నావికాదళ సిబ్బంది, మత్స్యకారులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే కట్టడం మాత్రమే కాదని, సముద్ర సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాలని కేంద్ర ఓడరేవులు,

షిప్పింగ్ జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. విశాఖపట్నంలో నిర్వహించిన "లైట్ హౌస్ ఫెస్టివల్ 3.0"లో మాజీ ఉపరాష్ట్రపతి యం. వెంకయ్యనాయుడు, మంత్రి కందుల దుర్గేష్ తో కలిసి ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించారు. అనంతరం బహిరంగ సభలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ,

వాయిస్..30 సెకన్లు

-----------------------

కృష్ణా గోదావరి నదీ జలాల వినియోగ అంశంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణా ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నిన్న స్పందించారు. ఆంధ్ర ప్రదేశ్ లోని తూర్పు గోదావరి జిల్లా రాయవరంలో జరిగిన ఒక కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలకు తావు లేకుండా ఈ సమస్యకు పరిష్కారం కనుగొనాలని ఆశిస్తున్నానని స్పష్టం చేశారు. ఘర్షణలు లేకుండా ఉభయ రాష్ట్రాలు కృష్ణా నదీ జలాలను వినియోగించుకోవాలని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ

వాయిస్ .. 25 సెకన్లు

అలాగే హైదరాబాదు సమీపంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, సామరస్యపూర్వక చర్చల ద్వారా జలాల సమస్యకు పరిష్కారం సాధించాలని తెలంగాణా కోరుకుంటోందని అన్నారు. సమస్య పరిష్కారానికి పరస్పర సహకారం అవసరమని రేవంత్ రెడ్డి తెలిపారు.

-----------------------

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరగనున్న 'ప్రపంచ ఆర్థిక వేదిక'లో 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్'ను విస్తృతంగా ప్రచారం చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అధికారులను

ఆదేశించారు. ఈ నెల 19 నుంచి 23 వరకు జరగనున్న దావోస్ సదస్సులో అమలు చేయనున్న వ్యూహాత్మక ప్రణాళికలపై ఉన్నతాధికారులతో హైదరాబాద్ లో నిన్న సమీక్ష నిర్వహించారు. గత దావోస్ పర్యటనలు, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ లో వచ్చిన పెట్టుబడులు, ప్రతిపాదనలు, ఒప్పందాలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధిని సాధించే దిశగా రూపొందించిన కార్యాచరణలను దావోస్ సదస్సులో ప్రచారం చేయాలన్నారు. పెట్టుబడుల అమలులో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్ లోని జైళ్ళు, అగ్నిమాపక శాఖలలో త్వరలోనే ఉద్యోగాల భర్తీ చేపడతామని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. నెల్లూరులోని కేంద్ర కారాగారాన్ని మంత్రి నిన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీలతో మాట్లాడి వారికి కల్పిస్తున్న సదుపాయాలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం హోం మంత్రి అనిత మాట్లాడుతూ... కారాగారంలో ఖైదీలు పలు రకాల ఉత్పత్తులను తయారు చేస్తుండటం అభినందనీయమన్నారు.

వాయిస్ .. 25 సెకన్లు

-----------------------

కీలక ఖనిజా రంగంలో విలువ ఆధారిత పరిశ్రమలు రావాలని ఆంధ్రప్రదేశ్ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జాతీయ మైనింగ్ మంత్రుల కాన్ఫరెన్స్- "జాతీయ ఖనిజ చర్చా శిబిరం -2026" సమావేశంలో కేంద్ర గనులు, బొగ్గు శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డితో కలిసి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, భారతదేశ సముద్ర తీరప్రాంత ఇసుక ఖనిజ వనరులలో మూడవ వంతు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయన్నారు. దేశంలో అపారమైన ఖనిజ వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా దేశీయంగా గనుల నిర్వహణ, విలువ జోడింపు ప్రక్రియలపై దృష్టి

పెట్టడం అత్యంత అవసరమని చెప్పారు. గనుల శాఖ సామర్థ్యాన్ని పెంచడంతోపాటుగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూనే ఆదాయం పెందచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

-----------------------

మారిన సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా.. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం వీబీ జీ రామ్ జీ చట్టాన్ని తీసుకువచ్చిందని విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. పత్రికా సమాచార కార్యాలయం -పిఐబి విజయవాడ ఆధ్వర్యంలో విజయనగరంలో వీబీ జీ రామ్ జీ చట్టంపై పాత్రికేయులకు వార్తాలాప్ కార్యక్రమాన్ని నిన్న నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అప్పలనాయుడు పాల్గొని పత్రిక, ప్రసార మాధ్యమాల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్..30 సెకన్లు

-----------------------

ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో పాఠశాలలకు ఈ రోజు నుండి సంక్రాంతి సెలవులు ప్రారంభమయ్యాయి. ఆంధ్ర ప్రదేశ్ లో ఈ రోజు నుండి 18 వ తేదీ వరకు పాఠశాలలకు సెలవులు ప్రకటించగా, తెలంగాణా రాష్ట్రంలో ఈ రోజు నుండి 16 వ తేదీవరకు సెలవులు ఇచ్చారు. ఆంధ్ర ప్రదేశ్ లో 19 వ తేదీ సోమవారం, తెలంగాణా రాష్ట్రంలో 17 వ తేదీ శనివారం నుండి పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో స్వస్థలాలకు వెళ్లే ప్రయాణికులతో ఉభయ రాష్ట్రాలలో రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్ లలో రద్దీ నెలకొంది. ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 8 వేల 432 బస్సులు, తెలంగాణా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 6 వేల 431 ప్రత్యేక బస్సులను నడుపుతున్నాయి.అలాగే సంక్రాంతి పండుగ కోసం దక్షిణ మధ్య రైల్వే ఆరు వందల ప్రత్యేక రైళ్ళను నడుపుతోంది.

-----------------------

నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ తీవ్ర వాయుగుండం వాయవ్య దిశగా కదులుతూ.. శ్రీలంకలో ట్రింకోమలీ, జాఫ్నా మధ్య తీరం దాటే అవకాశముందని తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్లోని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఈరోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి తెలిపారు.

ఇక తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు లోయలో 4.3 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా.. తెలంగాణాలోని ఆదిలాబాద్లో 8.2 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

= = = = = = = = = = = = = = = = = = = =